క్లుప్తంగా

ప్లేట్లు, చాపలు, దుప్పట్ల పంపిణీ



గ్లాసులు, కంచాలు, దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం సమీపంలోని పల్లపూరు నిర్వాసిత కాలనీ వద్ద శుక్రవారం ఆత్మబంధువులం సంస్థ (తాడేపల్లిగూడెం) ఆధ్వర్యంలో నిర్వాసిత గిరిజన అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు భోజనం ప్లేట్లు, దుప్పట్లు, పలక, సబ్బులు, చాపలు పంపిణీ చేశారు. వీటిని 200 మంది విద్యార్థులకు డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కరాటం సాయిల చేతుల మీదుగా అందజేశామని సంస్థ ప్రతినిధి ఉషాకిరణ్ తెలిపారు.

కనులపండువగా శ్రీవారి తిరువీధి సేవ

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శుక్రవారం శ్రీవారి తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని నిత్యం ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉదయం స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి క్షేత్ర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు.

వృక్షాలను నరకొద్దని ఆందోళన

కొయ్యలగూడెం: భారీ వృక్షాలను అక్రమంగా నరికేయవద్దంటూ కన్నాపురం గ్రామంలో ప్రజలు శుక్రవారం ఆందోళన చేశారు. యర్రాయిగూడెం రోడ్డులోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న రెండు భారీ చింత చెట్లను అనధికారికంగా నరికి వేస్తున్నారని, దీనిపై పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని వాపోయారు. వృక్షాలను బేరన్ క్యూరింగ్ నిర్వహణకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని డీఎల్‌డీఓ, ఈవోపీఆర్‌డీ తెలిపారు.

కృత్రిమ అవయవాల అందజేత



అవయవాన్ని అదిస్తున్న మేనేజర్ శ్రీనివాస్

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో త్రీడీ ప్రింట్‌తో తయారైన (ప్రోస్తాసిస్) కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌ను 15 మందికి శుక్రవారం గుప్తా ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్ చేతుల మీదుగా అందించారు. గ్రామీణులకు విర్డ్ మెరుగైన వైద్య సేవలను అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులున్నారు.

స్వయం ప్రతిపత్తి కల్పించాలి

జంగారెడ్డిగూడెం: హిందూ ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరుతూ జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావానికి భారీగా హిందువులు తరలి రావాలని వీహెచ్‌పీ నాయకులు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం శంఖారావం పోస్టర్‌ను వారు విడుదల చేశారు.

వీహెచ్‌పీ ర్యాలీ

కొయ్యలగూడెం: హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలంటూ బయ్యనగూడెంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. పెద్ద రామాలయం నుంచి జాతీయ ప్రధాన రహదారి మీదుగా గ్రామంలోని ప్రధాన రోడ్లలో శంఖారావం సభ కరపత్రాలను ప్రజలకు పంచారు.

పేద వధూవరులకు సాయం

జంగారెడ్డిగూడెం: ఆర్యవైశ్య పేద వధువరులకు వివాహ సామగ్రిని అందించేందుకు కంచర్ల అచ్చయ్య వెంకటమ్మ కల్యాణమస్తు ట్రస్ట్‌ను ప్రారంభించినట్టు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు. శుక్రవారం స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం సన్నిధిలో అద్దంకి రఘురామ్ ఆధ్వర్యంలో కల్యాణమస్తు ట్రస్ట్‌ను ప్రారంభించారు. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు రఘురామ్ తెలిపారు. దూబగుంట్ల బాపిరాజు, చిన్ని సత్యనారాయణ (సీహెచ్ ఆర్), తారకం తదితరులు పాల్గొన్నారు.

వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి వెండి చీర తయారీకి నిమ్మగడ్డ సత్యనారాయణ దంపతులు 10 తులాలు, కందుకూరి నాగ చంద్రరావు దంపతులు 5 తులాల వెండిని అందజేశారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ వినతి

కామవరపుకోట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు ఎయిమ్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద కుమార్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఎయిమ్ మండల కన్వీనర్ మాండ్రు లాజర్, సభ్యులు కాకర్ల సత్యం, బోడ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీల పెంపు సిగ్గుచేటు

- హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త సునీల్ కుమార్
- సబ్ స్టేషన్ల వద్ద వైఎస్సార్ సీపీ పోరుబాట



కొయ్యలగూడెం : నిరసన వ్యక్తం చేస్తున్న సునీల్ కుమార్, బాలరాజు

కొయ్యలగూడెం: సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వానికి శక్తి సామర్థ్యాల్లేకే ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపిందని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్ ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు కొయ్యలగూడెంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో సునీల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మోసానికి, ద్రోహానికి ప్రతీక అని, అయినప్పటికీ మరోసారి నమ్మి మోసపోయామంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారని వివరించారు. కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా కన్వీనర్లపై కక్ష సాధింపులకు పాల్పడుతూ హింసాత్మక చర్యలకు పాల్పడిందని బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు పగలు జగన్ ఫోబియో, రాత్రికి జమిలి ఎన్నికల ఫోబియోతో నిద్రలేని రాత్రులు గడుపుతూ పాలనపై దృష్టి సారించలేకపోతున్నారని పార్టీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ ఆరోపించారు. తొలుత మెయిన్ సెంటర్‌లోని గణపతి ఆలయంలో పూజలు చేశారు. మహానేత వైఎస్ విగ్రహానికి వేసి నివాళులర్పించారు. అనంతరం హైవే మీదుగా చెక్ పోస్ట్ సెంటర్ నుంచి గవరవరం సబ్‌స్టేషన్ వరకు లాంతర్లను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. సబ్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీలు సుంకర వెంకటరెడ్డి, గంజిమాల రామారావు, తుమ్మలపల్లి గంగరాజు, గగ్గులోతు మోహనరావు, జెడ్పీటీసీ సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, మొడియం రామతులసి, ఎం వసంతరావు, మండల కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు, బుగ్గ మురళి, చందా ప్రసాద్, శీను రాజు, సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, మంతెన సోమరాజు, మల్లె చంటి నాయుడు, తమ్మిర్సి బ్రహ్మన్న, తాండ్రు రాజేష్, రావు వినోద్, వాసిరెడ్డి మధు, రాంపండు, ఏలేటి చంద్రం, దూలపల్లి కాంతారావు, చిడిపి రవి, ఏలేటి భాస్కర్, ఘంటసాల మధు, అనంతల సుబ్బారావు, బొమ్మ రామకృష్ణ, కొండపల్లి శివాజీ, గిద్దే సూర్యచంద్రరావు, కాటుబోయిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం : పోరుబాట ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు



చింతలపూడి : ట్రాన్స్‌కో ఏడీ రాంబాబు నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న విజయరాజు

చార్జీలను ఉపసంహరించుకోవాలి

చింతలపూడి : కరెంట్ చార్జీల పెంపును తక్షణం ఉపసంహరించుకోవాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ సవున్వయకర్త కంభం విజయరాజు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు శుక్రవారం ఏఎంసీ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరరావు గృహం వద్ద నుంచి విద్యుత్ ఏడీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడీ రాంబాబు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల కాలంలో రెండుసార్లు విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలవూలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రవుంలో జెడ్పీటీసీ సభ్యులు మొలుగువూటి నీరజా సుధాకర్, కడిమి రమేష్, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కేసరి సరితా విజయభాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, పార్టీ ప్రచార విభాగం జిల్లా అధక్షుడు చిలుకూరి జ్ఞానారెడ్డి, పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, జిల్లా గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు సాయిల స్వాతి, కె.కోట పట్టణ కన్వీనర్ నానాది సాగర్, వైస్ ఎంపీపీ వుట్లా సురేష్, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం ఇమ్మానియేలు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కె.దినేష్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి భరత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోలి శరత్ రెడ్డి, నాయకులు త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, మందలపు సాయిబాబు, సొంగా సందీప్, టి.వెంకట్రామిరెడ్డి, వై.రావుకృష్ణారెడ్డి, చుండూరి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తుకొస్తున్న జగన్ నిజాయతీ

జంగారెడ్డిగూడెం: అధికారం కోసం అబద్ధాలు ఆడకుండా ప్రజలకు ఏం చేయగలనో చెప్పిన జగన్ నిజాయతీని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జిలు అన్నారు. స్థానిక పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. డీఈ యు.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వేసే భారాలతో ప్రజలు రోడ్డుపైకి వస్తున్నారని తెలిపారు. హామీలు అమలు చేయలేని కూటమి ప్రభుత్వం వల్ల పండుగలు సైతం వెలవెలబోయే పరిస్థితి వచ్చిందని ఎద్దేవా చేశారు. తొలుత పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ మీదుగా సబ్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాతబస్టాండ్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కమిటీ అధ్యక్షులు చిటికెల అచ్చిరాజు, వామిశెట్టి హరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, ఎంపీపీ కొదమ జ్యోతి, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాసర తులసీరెడ్డి, మేడవరపు విద్యాసాగర్, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, కొల్లూరి రాంబాబు, బత్తిన చిన్న, ఘంటశాల గాంధీ, జెట్టి ఆదిత్య, ఓరుగంటి నాగేంద్ర, షేక్ అక్బర్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తున్న ప్రభుత్వం



గోపాలపురంలో ర్యాలీగా వెళుతున్న మాజీ వనిత, పార్టీ శ్రేణులు

ద్వారకాతిరుమల: ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం, విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచి సామాన్యుడి నడ్డివిరుస్తోందని మాజీ హోం మంత్రి తానేటి వనిత ధ్వజమెత్తారు. పెరిగిన విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల శ్రేణులు కూటమి పాలనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ నినాదాలు చేశారు. విద్యుత్‌శాఖ ఏడీఈ వి.రవిశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ ఎన్నికల హామీలను తుంగలోకి తొక్కడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. సంపదను సృష్టిస్తామని చెప్పి ప్రజలను కూటమి సర్కార్ నిలువునా దోచేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, మహిళా నేతలు దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, చెలికాని బుల్లియ్య, భోగరాజు చిన్ని, బిరుదుగడ్డ చల్లారావు, బాలం వెంకటేశ్వరరావు, మానుకొండ సుబ్బారావు, షేక్ బాషా, మానుకొండ కన్నయ్య, పసుపులేటి ఏసుబాబు, దాసరి రాంబాబు, కొండాబత్తుల గిరి, గుర్రాల లక్ష్మణ్, మానుకొండ ప్రసాద్, మానుకొండ భీమయ్య, ప్రతిపాటి యోహాను, గుమ్మడి శ్రీను, నల్లంటి రామారావు, బిరుదుగడ్డ బజారియ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళి



జంగారెడ్డిగూడెంలో మన్మోహన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు



చింతలపూడిలో నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ఆర్థికవేత్తగా మన్మోహన్ సింగ్ చూపిన దార్శనికత ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు అన్నారు. జంగారెడ్డిగూడెంలో మాజీ ప్రధాని మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి మన్మోహన్ అందించిన సేవలను జెట్టి కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పోల్నాటి బాబ్జి, బీవీఆర్, వామిశెట్టి హరిబాబు, చిటికెన అచ్యుతరామయ్య, ముప్పిడి శ్రీనివాసరావు, ముప్పిడి అంజి, జెట్టి ఆదిత్య, కుక్కల ధర్మరాజు, ఓరుగంటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సేవలు అమోఘం

చింతలపూడి : దేశ ప్రధానిగా మన్మోహన్ సింగ్ అందించిన సేవలు వురువలేనివని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. శుక్రవారం చింతలపూడిలో మన్మోహన్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. దేశ ఆర్థిక వ్యవస్థను సరైన దారిలో పెట్టిన ఘనత మన్మోహనేకే దక్కుతుందని విజరాజు అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోలుగుమాటి నీరజ, ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు కేసరి సరితా భాస్కర్ రెడ్డి, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు చిలుకూరి జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు



బొత్తప్పగూడెంలో సారా స్థావరం వద్ద తనిఖీ చేస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని ముద్దప్పగూడెం, కొవ్వాడ, పాత రాజానగరం గ్రామాల పరిధిలో నిర్వహించిన దాడుల్లో 1400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఈఎస్‌డీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సత్యవతి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో సుంకం చెల్లించని తెలంగాణ మద్యం 100 సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. జీలుగుమిల్లిలో నిర్వహించిన తనిఖీల్లో 150 మద్యం సీసాలు పట్టుకున్నామని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని, వ్యక్తిపై కేసు నమోదు చేశామని వివరించారు. దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఎరుకులపేటలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. శ్రీరాములు వెంకన్న అనే వ్యక్తి నుంచి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకని, కేసు దర్యాప్తు చేపట్టామని సీఐ పి.అశోక్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్ వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన



డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ సురేష్, సర్పంచ్ జయశ్రీ

లింగపాలెం: గ్రామాల అభివృద్ధే మండల పరిషత్ లక్ష్యమని వైస్ ఎంపీపీ మట్టా సురేష్ అన్నారు. శుక్రవారం కొణిజర్ల గ్రామంలో డ్రెయిన్ నిర్మాణానికి సురేష్, గ్రామ సర్పంచ్ నూజివీటి జయశ్రీ శంకుస్థాపన చేశారు. వైస్ ఎంపీపీ నిధులు సుమారు 10 లక్షలు డ్రెయినేజీకి కేటాయించినట్టు సురేష్ తెలిపారు. మండల పరిషత్ నిధుల ద్వారా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాల మేరకు గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్టు సురేష్ వివరించారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో మండల పరిషత్ నిధులు సుమారు రూ.80 కోట్లతో రోడ్లు, డ్రెయిన్ తదితర పనులు చేపట్టామన్నారు. కొణిజర్లలో ఎన్నో ఏళ్లగా ఉన్న డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు, లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగ సందీప్, వార్డ్ మెంబర్ చలమాల రమాదేవి, నీటి సంఘం డైరెక్టర్ ఉప్పు రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయం కూల్చివేత దుర్మార్గం



రెవెన్యూ అధికారులు కూల్చివేసిన కార్యాలయ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో నూతనంగా నిర్మించిన సీపీఐ కార్యాలయాన్ని రెవెన్యూ అధికారులు కూల్చివేయడం అత్యంత దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన బుట్టాయగూడెంలో పర్యటించారు. ఈ సందర్భంగా కూల్చేసిన సీపీఐ కార్యాలయ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ తమ పార్టీ 100వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా నూతన కార్యాలయం ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు నిర్వహించుకునే సమయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు జేసీబీతో కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. తమ పార్టీ కార్యాలయాన్ని కూల్చివేయడంలో స్థానిక ఎమ్మెల్యే పాత్ర ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, నాయకులు డేగా ప్రభాకరరావు, మన్నవ కృష్ణ చైతన్య, సాయిబాబా, బాడిస రాము పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయం కూల్చివేత నేపథ్యంలో బుట్టాయగూడెంలో 144 సెక్షన్ విధించారు. ముందస్తు చర్యల్లో భాగంగా సుమారు 35 మంది పోలీసులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి



డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: సమ్మె కాలంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాజమండ్రి రీజనల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఏలూరు జిల్లాలో ఇంజినీరింగ్ విభాగంలో పర్మినెంట్ కార్మికులుగా ఉన్న ఫిట్టర్‌లను టీప్ ఇన్‌స్పెక్టర్‌గా, వర్క్ ఇన్‌స్పెక్టర్లను అసిస్టెంట్ ఇంజినీర్‌గా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. ఐటీఐ అర్హత గల కార్మికులను ఇంజినీరింగ్ విభాగంలో నాన్ పీహెచ్ వర్కర్స్‌గా తీసుకోవాలని, ఇంజినీరింగ్ విభాగంలో ఐటీఐ అర్హత గల వారికి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని పేర్కొన్నారు. చింతలపూడి నగర పంచాయతీ కార్మికులకు జీతాలు ఏరియర్స్ బకాయలు చెల్లించాలని, వేతనం రూ.21,000 చెల్లించాలని, మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు ఉద్యోగం ఇవ్వాలని, ఎన్ఎంఆర్ కార్మికులకు పర్మినెంట్ చేసి హెచ్ఆర్ఏ, డీఏతో కూడిన జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. మునిసిపల్ ఉద్యోగ కార్మికులకు 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న హెచ్ఆర్ఏ, డీఏ, సరెండర్ లీవ్స్, ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు కూనపాముల విఘ్నేష్, ఒ.బుచ్చిబాబు, తొర్లపాటి బాబు, రమణరాజు, కుంచె వసంతరావు, కంతేటి వెంకటరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆనంద స్వరాలు

మిమిక్రీలో రాణిస్తున్న ఆనంద్



సినీ నటుడు సాయికుమార్ తో ఆనంద్

కామవరపుకోట: మిమిక్రీ అద్భుతమైన కళ. మిమిక్రీ పేరు చెబితే ప్రతి ఒక్కరికీ గుర్తుకొచ్చేది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మాధవన్. ఆయనను ఆదర్శంగా తీసుకుని 200 మందికి పైగా ప్రముఖుల గొంతులు అనుకూరిస్తు పలువురి ప్రశంసలు పొందుతున్నారు కామవరపుకోట కొత్తూరుకు చెందిన గరికముక్కు ఆనంద స్వరూప్. తండ్రి ఆశీర్వాదం చిరు వ్యాపారి కాగా, తల్లి అమృత గృహిణి. శనివారం అంతర్జాతీయ మిమిక్రీ దినోత్సవం. ఈ సందర్భంగా శుక్రవారం ఆనంద్ మాట్లాడుతూ.. ‘చిన్నతనం నుంచి మిమిక్రీ అంటే చాలా ఇష్టం. పాఠశాల స్థాయి నుంచే ఉపాధ్యాయుల గొంతులు అనుకరించడంతో వారు అభినందించేవారు. ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాలలో ఎంబీఏ పూర్తి చేశాను. ఆ రోజుల్లోనే జిల్లాలో అనేక ప్రదర్శనలిచ్చాను. జిల్లా కలెక్టర్ల ప్రశంసలు, వారి చేత బహుమతులు అందుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 2000 వేలకు పైగా ప్రదర్శనలతో పాటు అవార్డులు, సత్కారాలు పొందాను. ఎన్నో టీవీ షోలు చేశాను. ప్రస్తుతం డబ్బింగ్ షోలు, టీవీ, స్టేజి షోలు చేస్తున్నాను. నేను ఎవరితోనైనా అరగంట పాటు మాట్లాడితే వాళ్ల గాత్రాన్ని అనుకరించగలను. సినిమాల్లో మిమిక్రీ కళాకారుడుగా గుర్తింపునకు కృషి చేస్తున్నాన’ని తెలిపారు.

సమస్యల పరిష్కారం కాగితాలకే పరిమితం

- పరిషత్ సమావేశాన్ని బహిష్కరించిన ప్రజాప్రతినిధులు



సమస్యలపై నినదిస్తున్న ప్రజాప్రతినిధులు

వేలేరుపాడు: మూడేళ్లుగా మండల పరిషత్ సమావేశాల్లో ప్రస్తావించిన ప్రజా సమస్యల పరిష్కారం కాగితాలకే పరిమితమైందని ప్రజాప్రతినిధులు ఆరోపించారు. శుక్రవారం వేలేరుపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బహిష్కరించారు. ఆర్అండ్ఆర్, పోలవరం నిర్వాసితులు, 18 సంవత్సరాల నిండిన వారికి ఆర్అండ్ఆర్, భూసేకరణ సమస్యలు, పెదవాగు గండితో నష్టపోయిన వారికి పరిహారం, రోడ్ల మరమ్మతులు, పోడు భూములకు పట్టాలు అనేక సమస్యలు పరిష్కారం కాలేదని ధ్వజమెత్తారు. వీటిపై జిల్లా కలెక్టర్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. గత మూడేళ్లలో మండల పరిషత్ తీర్మానాలు, చేసిన పనుల వివరాలను వెల్లడించాలని, తదుపరి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడినటువంటి వినతిపత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సోయం చంద్రరావు, తుర్రం తమ్మయ్య, కట్టం రత్తమ్మ, సర్పంచ్‌లు మడివి రంగమ్మ, సోడె విజయ, కట్టం రాంబాబు పాల్గొన్నారు.

9న ఆల్ ఇండియా డిమాండ్ డే

వేలేరుపాడు: అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు జనవరి 9న ఆల్ ఇండియా డిమాండ్ డేగా నిర్వహించనున్నట్టు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ తెలిపారు. శుక్రవారం వేలేరుపాడులో మాస్‌లైన్ ప్రజాపంథా ఏలూరు జిల్లా కమిటీ సమావేశం సిరికొండ రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఆల్ ఇండియా డిమాండ్‌డేలో భాగంగా జనవరి 9న విజయవాడ ధర్నా చౌక్‌లో వివిధ డిమాండ్‌లతో సదస్సు నిర్వహించనున్నట్టు గౌస్ తెలిపారు. గద్దాల ముత్యాలరావు, బి.సత్యనారాయణ, జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.